మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి, వేముల

మాజీ ఎమ్మెల్యేకు కేటీఆర్ నివాళి

ఉప్పల్, మే 12 : ఇటీవల కన్నుమూసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉప్పల్ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు బండారి రాజిరెడ్డి చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం నివాళులర్పించారు. హబ్సిగూడలోని రాజిరెడ్డి నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. రాజిరెడ్డి సోదరుడు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు తుల ఉమ, గెల్లు శ్రీనివాస్ యాదవ్, చిరుమల్ల రాకేశ్, గజ్జెల నాగేశ్, వాసుదేవారెడ్డి, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, జేరిపోతుల ప్రభుదాస్, బన్నాల గీతా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుమనిషి నాయిని నర్సింహారెడ్డి

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్

హైదరాబాద్ మే 12 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక తెలంగాణ, కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఉక్కుమనిషి నాయిని నర్సింహారెడ్డి అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ అభివర్ణించారు. నాయిని జయంతి సందర్భంగా సోమవారం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయినితో ఉన్న అనుబంధాన్ని నెమరేసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో సాగిన తెలంగాణ మహోద్యమంలో నాయిని కీలకభూమిక పోషించారని కొనియాడారు. కార్మికనేతగా కూలీలు, కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. నాయిని సేవలు, త్యాగశీలత తరతరాలకు స్ఫూర్తినిస్తాయని దాసోజు తెలిపారు.

కరాచీ బేకరీపై దాడి దుర్మార్గం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కరాచీ బేకరీపై మతోన్మాద, అరాచకశక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా కుల, మతాలకు అతీతంగా దేశంమొత్తం ఐక్యంగా నిలబడి సైన్యానికి మద్దతుగా నిలబడిన సందర్భంలో ఇలాంటి చర్యలు అనైతికతకు దారితీస్తాయని ఆయన పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో పాకిస్థాన్ కరాచీ నుంచి వచ్చిన హిందువుల కుటుంబం దేశవ్యాప్తంగా కరాచీ పేరుతో బేకరీలను ఏర్పాటు చేసి ఏండ్ల తరబడి నడిపిస్తున్నదని ఆయన వివరించారు. మతోన్మాదులు పాకిస్థాన్ నగరం పేరు ఉందని, ఈ అరాచకానికి పాల్పడటం ఆక్షేపణీయమని ఆయన తెలిపారు. ఇలాంటి చర్యలకు తావివ్వకుండా నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మిక పక్షపాతి నాయిని

- తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర కీలకం
- స్వరాష్ట్రం కోసం 22 ఏండ్లు కేసీఆర్‌తో పనిచేశారు
- స్టీల్ బ్రిడ్జికి ఆయన పేరు పెట్టి గౌరవించుకున్నం
- నర్సింహారెడ్డి కుటుంబానికి అండగా ఉంటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో నాయిని జయంత్యుత్సవాలు

తెలంగాణ భవన్‌లో నాయిని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయిని అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ మే 12 (నమస్తే తెలంగాణ): జీవితాంతం కార్మికుల హక్కులు, వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతిగా నిలిచిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు మనమందరం కంకణబద్ధులమవుదామని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న గొప్ప నేత నాయిని అని కీర్తించారు. స్వరాష్ట్ర సాధన కోసం 22 ఏండ్ల పాటు కేసీఆర్ వెంట నడిచి ఉద్యమంలో కీలకభూమిక పోషించారని గుర్తుచేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి 85వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని చిత్రపటానికి కేటీఆర్, మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కుత్బుల్లాపూర్, గోషామహల్ ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, ముఠా గోపాల్, నాయిని తనయుడు దేవేందర్‌రెడ్డి, అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్, తుల ఉమ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తామందరికీ పెద్దన్నలా నాయిని దారిచూపారని గుర్తుచేశారు. వీఎస్టీ ఫ్యాక్టరీలో కార్మిక నేతగా ఆయన ఎన్నో పోరాటాలు చేసి హక్కులను సాధించారని పేర్కొన్నారు. తెలంగాణ తొలి హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాయిని ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయించారని తెలిపారు. తెలంగాణకు కాంగ్రెస్ చేస్తున్న మోసానికి నిరసనగా మంత్రి పదవికి రాజీనామా చేయాలన్న కేసీఆర్ ఆదేశాలను శిరసా వహించి అమెరికా నుంచి ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖను గవర్నర్, స్పీకర్‌కు పంపించి నిబద్ధతను చాటుకున్నారని గుర్తుచేశారు. ఆయన సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండి ఆస్తులను కాకుండా పేరు, గౌరవం సంపాదించిన అరుదైన నాయకుడని ప్రశంసించారు. ముషీరాబాద్ నియోజకవర్గ, హైదరాబాద్ ప్రజలకు ఎనలేని సేవలందించారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు హైదరాబాద్ నగర మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచారని చెప్పారు. నాయిని సేవలను గుర్తించిన కేసీఆర్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి ఆయన పేరు పెట్టి సమున్నతంగా గౌరవించారని గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

విలువలకు చిరునామా: సిరికొండ

హైదరాబాద్ పేరు చెప్పగానే గుర్తుకొచ్చే కొందరు నేతల్లో నాయిని నర్సింహారెడ్డి ఒకరని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి చెప్పారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో పనిచేసిన నాయిని విలువలు, నిబద్ధతకు మారుపేరని కొనియాడారు. రామనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్, జార్జ్ ఫెర్నాండేజ్ తదితర మహనీయుల స్ఫూర్తితో పేదలు, కార్మికుల సంక్షేమం కోసం ఉద్యమించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్, రవికుమార్, రాకేశ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రసమయి కుమారుడి వివాహం

మెహదీపట్నం మే 12 : మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడు ఆదర్శ్ వివాహం.. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంజయ్ కుమార్తె మౌనికతో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, ఎంపీ రఘునందన్ రావు, బీఆర్ఎస్ నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గ నేతలు సీహెచ్ ఆనంద్ కుమార్‌గౌడ్, జీవన్ సింగ్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

కులగణనకు చట్టసవరణ తప్పనిసరి!

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): జనగణనలో భాగంగా కులగణన చేయాలంటే చట్టసవరణ తప్పనిసరి అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టంలో లేని విషయాన్ని కార్యనిర్వాహక నిబంధనల ద్వారా అమలుచేయడం రూల్స్‌కు విరుద్ధమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసినట్టు తెలిపారు. ఫలితంగా 2011 కులగణన నివేదిక పనికిరాదని, 2021లో సుప్రీంకోర్టులో కేంద్రమే అఫిడవిట్ దాఖలు చేసి అంగీకరించిందని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీలు రాజ్యాంగ షెడ్యూళ్లలో ఉన్నందున, ఆయా వర్గాల గణన చట్టబద్ధమేనని, ఓబీసీలకు అలాంటి చట్టబద్ధ గుర్తింపు లేనందున జనగణన చట్టాన్ని సవరించడం తప్పనిసరి స్పష్టంచేశారు.

పూర్తిస్థాయి రుణమాఫీ అమలుచేయాలి

- మంత్రి తుమ్మలకు సీపీఐ వినతి

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహతో కలిసి సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. రూ.2లక్షల రుణమాఫీ అమలులో ప్రభుత్వ షరుతలతో దాదాపు 40శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని మంత్రికి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో రుణమాఫీకి అర్హులైనవారు 9,588 ఉండగా, వారిలో 5,864 మందికి మాత్రమే రుణమాఫీ అయినట్టు తెలిపారు.

కర్ణాటకలోని జమ్గి నుంచి బైక్‌లపై నీటిని తెచ్చుకుంటున్న శాంతినగర్‌తండా యువకులు

తాగునీటికి కర్ణాటకకు పరుగులు

- గోస పడుతున్న శాంతినగర్‌తండా
- నిలిచిన నీరు, విద్యుత్తు సరఫరా
- ఆదుకోవాలని గిరిజనం వేడుకోలు

నారాయణఖేడ్, మే 12: మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారుతో మస్తు తిప్పలవుతున్నదని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శాంతినగర్ తండావాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కర్ణాటక సరిహద్దున మూలకు విసిరేసినట్టున్నగా ఉన్న ఈ తండాలో 500 జనాభా ఉంది. బీఆర్ఎస్ హయాంలో ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. మిషన్ భగీరథ పథకంతో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించింది. కాంగ్రెస్ వచ్చాక భగీరథ నిర్వహణలో నిర్లక్ష్యంతో తిప్పలు తప్పడంలేదు. పది రోజులుగా తండాకు నీరు సరఫరా కాకపోవడంతో కర్ణాటకలోని జమ్గికి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్తు సరఫరా కాగా, ఇప్పుడు విద్యుత్తు సమస్య వెంటాడుతున్నది. రోజుల క్రితం తండాలోని ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోగా, అప్పటి నుంచి అంధకారం అలుముకుంది. గ్రామ ప్రత్యేకాధికారులకు సమాచారం ఇవ్వగా తండావాసులంతా కలిసి డబ్బులు పోగేసి మరమ్మతులు చేసుకోవాలని చెబుతున్నారని గిరిజనులు వాపోయారు.

బీసీల్లో కులాల చేర్పుపై అభ్యంతరాల స్వీకరణ

31లోగా సమర్పించాలని బీసీ కమిషన్ వెల్లడి

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : 2014లో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చాలనే అంశంపై, పలు కులాల పేర్ల మార్పుపై అభ్యంతరాలను 31లోగా సమర్పించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ చెప్పారు. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. దొమ్మర, పిచ్చుకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, వీరముష్టి, కుమ్మర, రజక, మేర కులాల పేర్ల మార్పుపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని నిర్ణయించారు. 2014లో తెలంగాణ బీసీ జాబితాను రూపొందించే క్రమంలో 26 కులాలను తొలగించారు. వాటజాబితాలో చేర్చే అంశంపై బహిరంగ విచారణతోపాటు వినతులు, అభ్యంతరాలు స్వీకరించాలని కమిషన్ నిర్ణయించింది. 15న నోటిఫికేషన్ జారీ చేయాలని, జూన్ 9,10,11న బహిరంగ విచారణ, 31 నుంచి జూన్ 13వరకు వినతులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు.

2,000 మంది సిబ్బందికి ఎసరు?

- 1274 జీవో మర్మమేమిటి?
- ఒక్క ఎస్సీ గురుకులాల సొసైటీలోనే అమలు
- పార్ట్‌టైం, కాంట్రాక్టు సిబ్బంది తొలగింపే లక్ష్యం
- తాజాగా జీవో సాకుతో తీసివేతకు రంగం సిద్ధం
- ఔట్‌సోర్సింగ్ వ్యవస్థకే మంగళం పాడే యత్నం

హైదరాబాద్, మే12 (నమస్తే తెలంగాణ): బాలికల గురుకులాలు, విద్యాసంస్థల్లో కేవలం మహిళా సిబ్బందినే నియమించాలనేది జీవో 1274 నిర్దేశిస్తున్నది. ఏ సొసైటీలోనూ ఈ జీవో అమలవడం లేదు. ఇటీవల బదిలీలు, ప్రమోషన్ల సమయంలో ఈ జీవోను పూర్తిగా పక్కనబెట్టిన ఎస్సీ గురుకుల సొసైటీ.. ఇప్పుడు అకస్మాత్తుగా, యుద్ధప్రాతిపదికన జీవో అమలుకు పూనుకోవడం విస్మయానికి గురిచేస్తున్నది. అయితే సొసైటీలోని సుమారు 2,000 మంది పార్ట్‌టైమర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మొత్తాన్ని తొలగించడమే ఏకైక లక్ష్యంగా దీనిని ముందుకు తెచ్చినట్టు అధికారవర్గాలే తేల్చిచెప్తున్నాయి. ఏటా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు ఇవ్వాల్సిన ప్రొసీడింగ్స్ ఆర్డర్స్‌ను సొసైటీ ఈ ఏడాది ఇప్పటివరకూ ఇవ్వకపోవడం దానికి బలం చేకూరుతున్నది. జీవో సాకుతో ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా ఎత్తేసేందుకు సొసైటీ ఉన్నతాధికారులు మళ్లీ పావులు కదుపుతున్నారని వివరిస్తున్నారు. ఎస్సీ గురుకులాల తీరే ఇప్పుడు అంతుచిక్కడం లేదు. నిరుడు సెప్టెంబర్‌లో సొసైటీ పరిధిలోని సీవోఈ, ఇతర గురుకులాల్లో పార్ట్ టైం ఉద్యోగులందరినీ రాత్రికి రాత్రే సొసైటీ విధుల నుంచి తొలగించింది. మానవ హక్కుల కమిషన్ చొరవ మేరకు వారిని తిరిగి యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది.

2,000 మందికిపైగా పురుష సిబ్బంది

గురుకుల సొసైటీలో 4,000 మందికిపైగా పార్ట్‌టైం ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. అందులో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, లైబ్రేరియన్, స్టాఫ్‌నర్స్ కలిపి సుమారు 2,000 మందికిపైగా పురుషులే ఉన్నారు. వీరిలో చాలామంది దశాబ్దకాలంగా కొనసాగుతున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయ సిబ్బందితో సమాన విధులు నిర్వర్తిస్తున్నారు. జీవో 1274ను సాకుగా చూపుతూ ఆ 2,000 మందిని పూర్తిగా తొలగించేందుకు సొసైటీ పూనుకున్నదని పార్ట్‌టైం సిబ్బంది ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై గురుకుల పార్ట్‌టైమ్ ఉద్యోగుల సంఘం నిప్పులు చెరుగుతున్నది.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

బాన్సువాడ రూరల్, మే 12: ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి నియోజకవర్గం బాన్సువాడలోని కొత్తాబాది గ్రామంలో తాగునీటి కోసం సోమవారం ప్రజలు రోడ్డెక్కారు. ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. సమస్యపై అధికారులు దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. పోలీసులు అక్కడికి వచ్చి, వారిని శాంతింపజేశారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని పంచాయతీ కార్యదర్శి గణేశ్‌ను తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు అర్హులం కాదా..?

- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారేను నిలదీసిన గిరిజన మహిళలు
- దశలవారీగా మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

కొత్తగూడెం జిల్లా కావడిగుండ్లలో ఎంపీ, ఎమ్మెల్యేను నిలదీస్తున్న గిరిజన మహిళలు

అశ్వారావుపేట, మే 12 : 'మేము ఇందిరమ్మ ఇండ్లకు అర్హులం కాదా? మాకు ఎందుకు మంజూరు చేయలేదు? కాంగ్రెస్ సానుభూతిపరులు, అనుచరులకే ఇందిరమ్మ కమిటీలు ఇండ్లు మంజూరు చేస్తున్నాయి, వెంటనే కమిటీలను మార్చాలి' అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కావడిగుండ్లలో గిరిజన మహిళలు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణను నిలదీశారు. సోమవారం ఎమ్మెల్యే, ఎంపీ స్థానికంగా సీసీ రోడ్లను ప్రారంభించారు. కావడిగుండ్లలో మహిళలతో వారు మాట్లాడగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై నిలదీశారు. స్పందించిన ఎమ్మెల్యే పది రోజుల్లో ఎమ్మెల్యే కోటా కింద ఐదు ఇండ్లు మంజూరు చేస్తానని, దశలవారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇల్లు మాకొద్దు

శివ్వంపేట, మే 12 : కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన షరతులతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోలేమని మెదక్ జిల్లా గంగాయిపల్లికి చెందిన లబ్ధిదారు పోచమ్మ పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇంటిని రద్దుచేయాలని కోరారు. ఇంటి విస్తీర్ణంలో ప్రభుత్వం విధించిన నిబంధనలతో చాలామంది ఇండ్లు రద్దయ్యే అవకాశం ఉండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

బిల్డర్ అక్రమానికి రెరా చెక్

బాధితురాలికి అనుకూలంగా ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): అయ్యన్న ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ కంపెనీ అక్రమాలకు టీజీ రెరా కళ్లెం వేసింది. కొనుగోలుదారులతో కుదుర్చుకున్న సేల్ అగ్రిమెంట్‌ను ఆ సంస్థ ఏకపక్షంగా రద్దు చేయడం కుదరదని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. శేరిలింగంపల్లి వద్ద 12 అంతస్తుల భారీ అపార్టుమెంట్ నిర్మాణాన్ని చేపట్టిన అయ్యన్న ఇన్‌ఫ్రా కంపెనీ.. ఒక్కో ఫ్లాట్‌ను 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించి ఇస్తామమంటూ ప్రీలాంచ్ విక్రయాలకు దిగింది. ఆ ఫ్లాట్లను కొనుగోలు చేసినవారికి 105 గజాల చొప్పున యూడీఎస్ (అన్ డివైడెడ్ స్పేస్)తో పాటు మూడు కార్లకు సరిపోయే పార్కింగ్ స్థలాన్ని ఇస్తామని నమ్మించింది. అలా హైదరాబాద్‌కు చెందిన వనజ అనే మహిళ పలు దఫాలుగా ఆమె మొత్తం రూ.3.62 కోట్లు చెల్లించి నాలుగేండ్లు గడిచినప్పటికీ ఫ్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకుండా మోసగించింది. ఆమెతో కుదుర్చుకున్న అగ్రిమెంట్ రద్దు చేస్తున్నామంటూ ఆమె భర్త మోహన్‌రావుకు మెయిల్ ద్వారా సమాచారం అందించింది. అనుకున్న సమయానికి వనజ వాయిదాలు చెల్లించకపోవడం వల్లనే అగ్రిమెంట్‌ను రద్దు చేశామని, ఆమె చెల్లించిన మొత్తంలో కొంత భాగాన్ని మినహాయించుకుని మిగిలిన డబ్బులను వాపసు ఇస్తామని చెప్పి జారుకునే ప్రయత్నం చేసింది. దీంతో మోసపోయానని గ్రహించిన వనజ తన వద్ద ఉన్న రశీదులతో రెరా కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రెరా.. బాధితురాలితో అయ్యన్న ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ కంపెనీ కుదుర్చుకున్న సేల్ అగ్రిమెంట్ రద్దయినట్టుగా గుర్తించడం లేదని స్పష్టం చేసింది. ఆమెకు కేటాయించిన 601 ఫ్లాట్‌తోపాటు కార్ పార్కింగ్ స్థలాన్ని, ఉమ్మడి స్థలాన్ని ఆమె పేరిటే రిజిస్ట్రేషన్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో పొంగులేటిని నిలదీస్తున్న సీపీఎం నేతలు

పొంగులేటికి నిరసన సెగ

- ప్రజా సమస్యలు పట్టవా?
- పదిసార్లు చెప్పినా వినరా?
- తిరుమలాయపాలెంలో పొంగులేటిని నిలదీసిన సీపీఎం నేతలు, కార్యకర్తలు

తిరుమలాయపాలెం, మే 12: 'ప్రజా సమస్యలు పట్టవా? పదిసార్లు విన్నపించుకున్నా పట్టించుకోరా? ఎంతలా మొరపెట్టుకున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదెందుకు?' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సీపీఎం నాయకులు నిలదీశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను సహా పలువురు నాయకులు కలిసి మంత్రి వద్దకు వచ్చారు. తిరుమలాయపాలెంలో నెలకొన్న సమస్యలను మరోసారి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో ప్రజలకు మరుగుదొడ్లు, బస్టాండ్ సెంటర్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయాలని కోరారు. ఇవే సమస్యలపై ఇప్పటికి పదిసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎందుకు పట్టించుకోవడంలేదంటూ నిలదీశారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు. నిరుపేదలకు, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, ఇందిరమ్మ కమిటీల బాధ్యులు పేదల పట్ల పక్షపాతవైఖరిని ప్రదర్శించారని ఆరోపిస్తూ మంత్రికి మరో ఫిర్యాదు చేశారు.